# మన పిల్లలకు హిందూమతం చెప్పడం ఎలా?

కె. అరవిందరావు

ఎమెస్కో

**ఇందులో విషయాలు :**


| | | |
|---|---|---|
| 1. | ఈ పుస్తకం ఎందుకు అవసరం | 05 |
| 2. | హిందువులంటే ఎవరు? | 08 |
| 3. | మతం అంటే ఏమిటి? | 11 |
| 4. | హిందూధర్మంలో తత్త్వశాస్త్రం, మతం – రెండింటి మేళనం | 14 |
| 5. | హిందువుల పవిత్రగ్రంథాలు | 17 |
| 6. | భగవంతుని తత్త్వమేమిటి? | 22 |
| 7. | ప్రపంచం ఎలా సృష్టించబడింది? | 26 |
| 8. | మనిషి – దేవుడు, వీరి సంబంధం ఎలాంటిది? | 30 |
| 9. | 'నేను' అంటే ఏమిటి? | 35 |
| 10. | మనమతంలో ఇందరు దేవుళ్ళెలా వచ్చారు? | 41 |
| 11. | దేవుళ్ళు – రాక్షసులు | 48 |
| 12. | పురాణాలు – కథలు | 52 |
| 13. | విగ్రహాల్ని పూజించడం | 60 |
| 14. | మనదంతా కర్మవాదమేనా? | 65 |
| 15. | ఫలితం లేకుండా పనిచేయమని గీత చెబుతుందా? | 68 |
| 16. | వర్ణం, కులం – వేదం ఏమి చెబుతుంది? | 72 |
| 17. | నాల్గు పురుషార్థాలు | 82 |
| 18. | భగవద్గీత | 86 |
| 19. | యోగం | 93 |
| 20. | ఆచారాలు – విశ్వాసాలు | 97 |
| 21. | పుస్తక సారాంశం | 101 |
| 22. | తల్లిదండ్రులకు మనవి | 104 |
| 23. | సంస్కృతం గూర్చి ఒకమాట | 108 |

# 1

# ఈ పుస్తకం ఎందుకు అవసరం?

**ఈ** చిన్ని పుస్తకం ఈనాటి బాల బాలికల కోసం వ్రాయబడింది. విషయం పాతదే అయినా ఈనాటి దృష్టి కోణంతో అర్థం చేసుకోవడం, చెప్పడం అవసరం.

మా చిన్నతనంలో పల్లెటూరి వాతావరణంలో పెరిగినపుడు బహుశా ఇలాంటి పుస్తకం అవసరం ఉండేది కాదు. ఏఏ పండుగ ఉంటే ఆయా దేవుణ్ణి పూజిస్తూ గుడికి వెళ్ళడం, లేదా ఇంట్లోనే ఆయా పూజల గురించి వ్రతాల గురించి కథలు వినడం చేసేవాళ్ళం. దేవుడంటే ఏమిటి, స్వర్గం, నరకం అంటే ఏమిటి అనేవాటి గురించి పురాణాలలో కథలు లేదా పౌరాణిక సినిమాలలో చూసిన విషయాలే మాకు ప్రమాణాలు. మా మనస్సుల్లో ఎలాంటి సందేహాలు ఉండేవి కావు. ఒకవేళ సందేహమంటూ ఉంటే ఏ దేవుడు అందరికన్నా బలవంతుడు, హనుమంతుడు బలవంతుడా, రాముడు బలవంతుడా లాంటి ప్రశ్నలు మాత్రం ఉండేవి. చాలా ఉత్సాహంగా రామనవమినాడు శ్రీరాముని పూజ, శివరాత్రి రోజు శివునిపూజ, లేదా దుర్గాష్టమి రోజు దుర్గాదేవి పూజ చేస్తూ గడిపేవాళ్ళం.

ఈరోజు కూడా బహుశా పల్లెల్లో కొంతవరకూ అలాంటి వాతావరణమే ఉండి ఉండవచ్చు. కానీ, సమాజంలో మార్పు కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది. దేవుళ్ళలో కూడా స్పర్ధ పెరిగినట్లు కనిపిస్తోంది. మా దేవుడు గొప్ప అంటే మా దేవుడు గొప్ప అనే మతాలు టూత్ పేస్టులు, సబ్బులు, ఎడ్వర్టైజ్ చేసినట్లుగా ఇతర మతస్థులు తమ తమ దేవుళ్ళ గురించి ప్రచారం చేస్తూ ఎన్నో వేల ఏళ్ళుగా భారతదేశంలో ఉన్న రాముడు, కృష్ణుడు, వేంకటేశ్వరుడు మొదలైన వాళ్ళని పనికిరాని వాళ్ళుగా చిత్రించడంతో పల్లెటూర్లలో కూడా చాల మార్పు వచ్చింది. ఆ మార్పు కళ్ళకు కనిపిస్తూనే ఉంది. హిందూమతంలో అబ్బో ఎంతోమంది దేవుళ్ళట, వీళ్ళు రాళ్ళని రప్పల్ని పూజిస్తారట అంటూ ప్రచారం చేస్తే చాలామంది ఇదంతా నిజమే కాబోలు అనుకునే వాతావరణం ఏర్పడింది. మనం

ఏ దేశానికీ వెళ్ళి వారి మతవిశ్వాసాల్ని తప్పుబట్టడం లేదు. కానీ మనదేశంలో మన విశ్వాసాలపై అసత్య ప్రచారం ఉన్నందువల్ల మనధర్మం యొక్క గొప్పదనాన్ని మనం తెలుసుకోవడం కనీస అవసరం.

అంతేకాదు, 21వ శతాబ్దంలో మతం గొడవ ఎందుకు? అని మనం అనుకోవచ్చు. ప్రపంచంలో అందరూ అలా అనుకుంటే చాలమంచిదే. కానీ ఇటీవల సామాజిక శాస్త్రవేత్తలు ఒక విషయాన్ని గమనించారు. 20వ శతాబ్దం కమ్యూనిజం, మావోయిజం, హిట్లర్ సిద్ధాంతం, పెట్టుబడి విధానం మొదలైన సిద్ధాంతాల మధ్య పోరాటం కాగా 21వ శతాబ్దంలో మతం మళ్ళీ ముఖ్యవిషయంగా మారిందని వీరు చెబుతున్నారు. దీని కారణంగానే అనేక దేశాల్లో వివిధ మతాలకు చెందినవాళ్ళ మధ్య పోరాటాలు, అంతర్యుద్ధాలు మొదలైనవి.

నేను కొన్ని నెలల క్రితం అమెరికా వెళ్ళినపుడు అక్కడ కొందరు తల్లిదండ్రులతో మాట్లాడే సందర్భంలో వాళ్ళు ఎదుర్కొనే కష్టాలు తెలిశాయి. మనదేశంలో పాఠశాలల్లో మతాల గురించి బోధించరు, కానీ పాశ్చాత్య దేశాలలో అన్ని మతాల గురించి ప్రాథమిక అవగాహన కల్గిస్తారు. సహజంగా తమ మతాన్ని గురించి గొప్పగా చిత్రించడం మిగతా వాటి గురించి కూడా చెప్పడం జరుగుతుంది. అక్కడ గమనించింది ఏమిటంటే ఒక్క హిందూమతం గురించి చెప్పే సందర్భంలో మాత్రమే అవహేళన చేస్తూ బోధిస్తున్నట్లు తెలుస్తుంది. పిల్లలు ఈ విషయంలో తమ తల్లిదండ్రులను ప్రశ్నించడం, వారు తెల్లముఖం వేయడం జరుగుతూంది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులకు కూడా అంతో ఇంతో మన మతం గూర్చి సరైన అవగాహన అవసరమని నాకు అనిపించింది.

అందుకే ఈ పుస్తకంలో మన మనసుల్లో తిరుగాడే కొన్ని ప్రశ్నలకి సమాధానం చెప్పడానికి ప్రయత్నించాను. మనమతంలో ఇంతమంది దేవుళ్ళు ఎందుకున్నారు? మనం విగ్రహాల్ని, పాముల్ని, పుట్టల్ని పూజిస్తామా? అంతా మన కర్మ బట్టే జరుగుతుందా? కులం అడ్డుగోడలు మతగ్రంథాలలో నిజంగా ఉన్నాయా – లాంటి ప్రశ్నలు ఈ పుస్తకంలో వివరించబడ్డాయి.

ప్రపంచీకరణ నేపథ్యంలో ఈనాటి యువతకు, బాలబాలికలకు కూడా ఎన్నో ప్రశ్నలు మెదులుతుంటాయి. పాశ్చాత్యదేశాలలో అయితే మతం యొక్క మూలాల్నే ప్రశ్నించేవాళ్ళ సంఖ్య పెరుగుతోంది. హేతువాదం అనే పేరిట మతవిశ్వాసాల్ని ప్రశ్నించటం సాధారణమైంది.

ఈ పుస్తకంలో హిందూమతం యొక్క మూలగ్రంథాల్ని పరిచయం చేశాను. మూలగ్రంథాలంటే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత. వీటిలో మతము, వేదాంతశాస్త్రము రెండూ కలిసి ఉన్నాయి. వేదాంతానికి సంబంధించిన విషయాల్ని వీలైనంత సులభ భాషలో చెప్పడానికి ప్రయత్నించాను. అలాగే మూలగ్రంథాలకి ఆ తరువాత వచ్చిన ఇతిహాసాలు, పురాణాలకు ఎలాంటి సంబంధం ఉంది అనే విషయాన్ని కూడా చెప్పాను.

పిల్లల్ని ఉద్దేశించి వ్రాయబడిందే అయినా ఈ పుస్తకాన్ని తల్లిదండ్రులు చదివి అవగాహన చేసుకుని పిల్లలకి సరైన దృక్పథం కల్గించటం అవసరమని నా ఉద్దేశం. బాలబాలికలు నేరుగా ఈ పుస్తకాన్ని చదవలేకపోవచ్చు.

★ ★ ★

# 2

# హిందువులంటే ఎవరు?

ప్రపంచంలో అనేక మతాలున్నాయి. పాశ్చాత్య దేశాలన్నిటిలోనూ క్రైస్తవం ఉంది. అరేబియా ఖండం దాని చుట్టూవున్న దేశాలలో ఇస్లాం మతం ఉంది. బౌద్ధమతం మనదేశంలో పుట్టినదే అయినా చైనా, జపాన్, బర్మా, థాయిలాండ్ మొదలగు దేశాలలో ఉంది. హిందూమతం మాత్రం ముఖ్యంగా భారతదేశంలోనూ, నేపాల్ లోనూ ఉంది. అనేక చిన్న చిన్న మతాలు వందలాదిగా వివిధ దేశాలలో ఉన్నాయి.

ప్రపంచ జనాభా సుమారు ఏడు బిలియన్లు, అనగా ఏడువందల కోట్ల వరకూ ఉంది. అందులో హిందువుల సంఖ్య సుమారు డెబ్భై నుండి ఎనభై కోట్ల వరకూ ఉండవచ్చని అంచనా. ప్రపంచంలో అతి ఎక్కువగా వ్యాప్తిలో ఉన్న మతం క్రైస్తవం. రెండవ స్థానంలో ఇస్లాం ఉంది. మూడవది బౌద్ధమతం. ఆ తరువాత నాల్గవ స్థానంలో హిందూమతం ఉంది. ఇంకా పూర్తి వివరాలు ఇంటర్నెట్‌లో లభ్యమవుతాయి.

హిందూ అనే పదాన్ని గురించి అందరూ అంగీకరించిన విషయం – సింధునది ప్రాంతంలో ఉన్నవారు అని. పర్షియా దేశస్థులు 'సింధు' అనే పదాన్ని 'హిందు' అనడం వల్ల హిందూదేశం అనే పేరు వచ్చిందని చరిత్రకారులు వ్రాస్తుంటారు. ఈ దేశంలో అనేకులు అనుసరిస్తున్న విశ్వాసాలని హిందూమతం అని అనడం జరిగింది.

నిజానికి మన గ్రంథాలలో చూస్తే హిందూమతం అనే పేరు కనిపించదు. దీనిని సనాతన ధర్మం అనే అంటూ వచ్చారు. 'సనాతనం' అనే మాటకు 'ఎల్లప్పుడూ ఉండేది, శాశ్వతమైనది' అని అర్థం. ఎన్నో వేల ఏళ్ళుగా మన మహర్షులు, ఋషులు సనాతన ధర్మం అనే వ్యవహరించారు.

ధర్మం అంటే ధరించి ఉంచేది, అనగా సమాజం విడిపోకుండా జాగ్రత్తగా పట్టి ఉంచేది. 'ధారణాత్ ధర్మ ఉచ్యతే' అని దీన్నే సంస్కృతంలో అంటారు. విడిపోకుండా ఉండాలంటే కొన్ని కట్టుబాట్లు, నియమాలు అవసరం. ఆచార వ్యవహారాలు ఒక పద్ధతి